

స్వచ్ఛతలో ముందంజ

తుర్కయంజాల్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. 8లో▸



సమస్యల పరిష్కారానికే..

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పోరాడుదామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఆర్పీల అరెస్టు అమానుషం

మెప్మాలో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్‌ను అరెస్టు చేయడం అమానుషమని సీఐటీయూ ఉపాధ్యక్షుడు కిషన్ మండిపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

రైతుల పక్షాన పోరాటం

మాజీ మంత్రి సబితారెడ్డి



కందుకూరు ఏఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రైతులకు రుణమాఫీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలో ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారని..? ఎంతమంది రైతులది పెండింగ్‌లో ఉంది చెప్పాలని ఏఓను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిగా రుణమాఫీ అయ్యే వరకు రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, మేఘనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, ప్రశాంత్‌చారి, కొండల్‌రెడ్డి, జంగయ్య, రవీందర్, ఉమాకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యర్థాలను భూమిలోనే కలియదున్నాలి

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ నర్సింహారావు

కేశంపేట: రైతులు సాగులో సేంద్రియ ఎరువులనే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో పలువురు రైతుల వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ... రైతులు భూముల్లో వ్యర్థాలను పొలంలోనే కలియదున్నాలని సూచించారు. దీంతో భూసారం పెంపొందడంతో పాటుగా సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుందన్నారు. సూక్ష్మజీవులతో మొక్కలకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎక్కువగా అందుతుందని చెప్పారు. ఎస్ఎస్‌పీ చల్లడంతో వరి కొయ్యల్లాంటి వ్యర్థాలు త్వరగా మురుగుతాయని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శిరీష, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సుధ, రైతులు అమర్‌నాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదయ్య తదితరులు ఉన్నారు.

నిండుగా.. వందేళ్ల పండుగ

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య




సభ్యత్వాలు అందజేస్తున్న జంగయ్య

షాబాద్: సీపీఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 2025 పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఏర్పడిన 2025 డిసెంబర్ 26 నాటికి 99 సంవత్సరాలు పూర్తి చేసుకని 100 సంవత్సరాలు అవతుతున్న సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. నాటి నుంచి నేటి వరకు అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రాములు, నారాయణ, మధు, నర్సింహులు, శ్రీనివాస్, రుక్కయ్య, రామకృష్ణ, తదితరులున్నారు.

నేడు కోకాపేటకు సీఎం రాక

మణికొండ: కోకాపేటలో శనివారం కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ (కురుమ ఆత్మగౌరవ భవనం)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కురుమలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌లు కోరారు. శుక్రవారం వారు బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జెపాల్‌రెడ్డి, నార్సింగి ఏఎంసీ వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



'ఫ్యూచర్' సిటీకి సూపర్ పవర్!

రెప్పపాటు కూడా కరెంట్ పోనివ్వం

- ఫీడర్లకు సెన్సార్లు.. నిరంతర మానిటరింగ్
- సిటీలో 30, శివారులో 40 శాతం డిమాండ్
- 'సాక్షి'తో సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాటు చేయదలిచిన ఫ్యూచర్/ఫోర్త్‌సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఫార్మా, ఐటీ అనుబంధ సంస్థలు అనేకం ఇక్కడికి రాబోతున్నాయి. ఇక్కడ నెలకొల్పే పరిశ్రమలకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని నిర్ణయించాం. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయబోతున్నాం. లైన్లను విస్తరించడంతో పాటు డిమాండ్ తట్టుకునే విధంగా కొత్త సబ్‌స్టేషన్లు, అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయబోతున్నాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. శుక్రవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన ఏమన్నారంటే..

ఏటా 30 నుంచి 40 శాతం గ్రోత్

సాధారణంగా ప్రతి ఏటా విద్యుత్ గ్రోత్ రేటు ఏడు శాతం నమోదవుతుంది. కానీ ఈసారి డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. రూరల్ ఏరియాలో గ్రోత్‌రేట్ ఏడు శాతం ఉంటే, నగరంలో 30 శాతం, నగర శివారు మున్సిపాలిటీల్లో 40 శాతం ఉన్నట్లు గుర్తించాం. భవిష్యత్‌ను డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించాం. ఆ మేరకు 2027లో రావాల్సిన కొత్త సబ్ స్టేషన్లను 2025లోనే తీసుకురాబోతున్నాం. డిస్కం పరిధిలో మొత్తం 164 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచాం. వీటిలో ఒక్క గ్రేటర్ జిల్లాల్లోనే 88 సబ్‌స్టేషన్లు రాబోతున్నాయి. బంజారాహిల్స్ సర్కిల్‌లో 5, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 9, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో 9, సికింద్రాబాద్ సర్కిల్లో 13, రాజేంద్రనగర్ సర్కిల్లో 13 చొప్పున, సైబర్‌సిటీ సర్కిల్‌లో 6, సరూర్‌నగర్ సర్కిల్ 5, వికారాబాద్‌లో 10, మేడ్చల్‌లో 18 చొప్పున కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నాం.

మణికొండలోనే అత్యధికం..

మణికొండ, అయ్యప్ప సొసైటీల్లో అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇక్కడ ఉన్న భవనాలపై స్పష్టత లేకపోవడంతో డిమాండ్‌పై స్పష్టత కొరవడింది. దీంతో విద్యుత్ వినియోగం ఊహకందడం లేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉన్న సర్కిళ్ల పరిధిలో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయబోతున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సహా దెబ్బతిన్న డీటీఆర్‌ల స్థానంలో కొత్తవి అమర్చడం వంటి వాటిని గుర్తించి, పునరుద్ధరించడం తదితర పనులు చేపట్టాం. అలాగే.. రాజేంద్రనగర్‌లో 160, సైబర్ సిటీలో 151, మేడ్చల్‌లో 160, హబ్సిగూడలో 857, బంజారాహిల్స్‌లో 89, సికింద్రాబాద్‌లో 148, హైదరాబాద్ సెంట్రల్‌లో 250, హైదరాబాద్ సౌత్‌లో 90, సరూర్‌నగర్‌లో 12, సంగారెడ్డిలో 563 అదనపు డీటీఆర్‌లు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రమాదాల నివారణ సహా ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్స్ తొలగింపునకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం.

ఫీడర్లకు సెన్సార్లు

నగరంలోని అన్ని సబ్‌స్టేషన్లకు మల్టీపుల్ ఇన్ కమింగ్, అవుట్‌గోయింగ్ లైన్లు ఏర్పాటు చేయబోతున్నాం. ఔటర్ చుట్టూ విద్యుత్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. 400 కేవీ సబ్‌స్టేషన్లు అనుసంధానిస్తున్నాం. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం జీహెచ్ఎంసీ సహా అన్ని ప్రధాన ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల ఫీడర్లకు సెన్సార్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తి కరెంట్ సరఫరా నిలిచిపోతే.. వెంటనే ఆ సమాచారం సంబంధిత అధికారులకు చేరే విధంగా సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ అంబులెన్స్‌లను కూడా వీటికి అనుసంధానిస్తున్నాం. ఇప్పటికే టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. మరో మూడు మాసాల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. కనురెప్ప పాటు కూడా కరెంట్ పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు పీటీఆర్‌ల సామర్థ్యం కూడా పెంచాం. దెబ్బతిన్న డీటీఆర్‌లను మార్చుతున్నాం. సెక్షన్లవారీగా ఎల్సీలు తీసుకుని, లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం.



మల్కీజ్‌గూడ నిధుల స్వాహాపై రికార్డులను తనిఖీ చేస్తున్న సెర్ప్, ఎస్‌బీఐ అధికారులు(ఫైల్)

రూ.63 లక్షలు హాంఫట్

- ఆందోళనలో మల్కీజ్‌గూడ డ్వాక్రా సంఘాలు
- రికార్డుల తనిఖీ పూర్తి
- వీబీకేను విచారిస్తున్న పోలీసులు

యాచారం: డ్వాక్రా సంఘాల మహిళల్లో ఆందోళన తీవ్రమవుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని మహిళలు పైసా, పైసా కూడబెట్టిన డబ్బులు స్వాహా కావడంపై గందరగోళం మొదలైంది. మండల పరిధిలోని మల్కీజ్‌గూడ వీబీకే(విలేజ్ బుక్ కీపర్) ఫోర్జరీ సంతకాలు, నకిలీ తీర్మానాలు చేసి రూ.63 లక్షలను యాచారం ఎస్‌బీఐ నుంచి స్థానికేతర మహిళల పేర్ల మీద బదిలీ చేయించారు. ఈ నేపథ్యంలో మల్కీజ్‌గూడలోని డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో సెర్ప్‌అధికారులు, ఎస్‌బీఐ సిబ్బంది వారం రోజుల పాటు గ్రామంలో రికార్డులను తనిఖీ చేసి రూ.63 లక్షలు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. అనంతరం గ్రామ డ్వాక్రా సంఘాల మహిళలు నిధుల స్వాహాపై విచారణ జరిపి, రికవరీ చేయించాలని గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీబీకే వరికుప్పల రాణిని యాచారం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇదే విషయమై యాచారం ఎస్‌బీఐ మేనేజర్ ఝాన్సీని సంప్రదించగా రూ.63 లక్షల నిధులు పక్కదారి పట్టాయని చెప్పారు.

అధికారులపై మండిపాటు

డ్వాక్రా సంఘాల సమావేశాలు, మహిళలు తీసుకున్న అప్పులు, రికవరీ, రికార్డుల నమోదు వంటి విషయాలపై సెర్ప్(గ్రామీణా పేదరిక నిర్మూలన సంస్థ) అధికారులు పట్టించుకోకపోవడంతోనే నిధులు పక్కాదారి పట్టాయని మహిళా సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీబీకే ఏడాది నుంచి నకిలీ తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలు పెట్టి రూ.లక్షలాది నిధులను స్వాహా చేస్తుండగా అధికారులు ఏం చేస్తున్నట్లు మహిళలు మండిపడుతున్నారు. బ్యాంకు అధికారుల తీరుపైనా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం



మల్కీజ్‌గూడ గ్రామంలోని డ్వాక్రా సంఘాల్లోని నిధుల స్వాహాపై మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీబీకే రాణిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. నిధుల అవకతవకలపై సెర్ప్, యాచారం ఎస్‌బీఐ బ్యాంకు అధికారుల నుంచి రికార్డులు అడిగాం.

– నర్సింహారావు, సీఐ యాచారం

ఎన్‌హెచ్-163 పై ముగిసిన వాదనలు

తుది తీర్పు రిజర్వు

చేవెళ్ల: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)విస్తరణ పనులకు సంబంధించి చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో వాదనలు ముగిసినట్లు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విస్తరణ పనుల్లో భాగంగా రహదారి పక్కన ఉన్న మర్రిచెట్ల విషయంపై తేజా బాలాంత్రపు అనే వ్యక్తి ఎన్జీటీలో కేసు వేయగా.. శుక్రవారం కోర్టు విచారణ చేపట్టింది. రహదారి విస్తరణ పనుల్లో జాప్యం వల్ల పెద్ద ఎత్తున ప్రమాదాలు, ప్రాణనష్టంపై ట్రిబ్యునల్ ముందు నేషనల్ హైవే అథారిటీ అధికారులు తమ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తుది తీర్పును రిజర్వులో పెట్టిందని ఆర్డీఓ వివరించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రాథమిక పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు: పి.కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నైలో ఎన్జీటీ కోర్టుకి ఆయన తన బృందంతో కలిసి వెళ్లాడు. వాదనల అనంతరం కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు గంటల పాటు కొనసాగిన వాదనల్లో నేషనల్ హైవే అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని.. ఏడాది క్రితం అడిగినా రిపోర్టులను ఇప్పటికీ సమర్పించకపోవడం పూర్తిగా ప్రభుత్వాల వైఫల్యమేనని స్పష్టం చేశారు.

ఫోర్జరీ చేసి.. ప్లాటు కాజేసి

- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ విజయ్‌కుమార్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లుగా నమ్మించారు.. నకిలీ ధ్రువపత్రాలను సృష్టించారు.. సదరు వ్యక్తి పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని కాజేసేందుకు కుట్ర పన్నారు.. ప్లాటు యజమాని ఫిర్యాదుతో పోలీసులు రంగప్రవేశం చేసి కటకటాల పాలు చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన కిరణ్ తివారీ భర్త దీపక్‌తివారీతో కలిసి పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. షాద్‌నగర్ ప్రాంతంలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ 2011లో కమ్మదనం శివారులోని 133 గజాల ఇంటి స్థలాన్ని కిరణ్ తివారీ పేరిట కొనుగోలు చేశారు. 2021లో హైదరాబాద్‌కు చెందిన గోపాల్, గోపేశ్వర్‌లు కిరణ్ తివారీ కొనుగోలు చేసిన ప్లాటుకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో తీసుకున్నారు. యజమాని చనిపోయినట్లు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి భర్త దీపక్‌తివారీ వారసుడని నమ్మబలికారు. అశోక్ అలియాస్ టిల్లు అనే వ్యక్తిని దీపక్‌తివారీగా పేర్కొని గోపాల్ పేరున సదరు ప్లాటును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తన ప్రమేయం లేకుండా ప్లాటును విక్రయించారని అసలు యజమాని కిరణ్‌తివారీ 2023లో షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గోపాల్, గోపేశ్వర్, అశోక్ అలియాస్ టిల్లును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డాక్యుమెంట్ రైటర్ విజయ్, సాక్షులు అబ్దుల్ జలీల్, లింగాల విజయ్‌లతోపాటుగా, సబ్ రిజిస్ట్రార్ పాత్రపై విచారణ చేస్తున్నట్లు పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కేసు ఛేదించడంలో చాకచక్యంగా ఎస్ఐ సుశీల, సిబ్బంది కరుణాకర్, జ్యోత్స్నలను సీఐ అభినందించారు.

నకిలీ ఆధార్ సృష్టించి రిజిస్ట్రేషన్

మొయినాబాద్: నకిలీ ఆధార్ కార్డును సృష్టించి వేరొకరి ప్లాట్లను ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన ఏడాది తర్వాత నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌కు చెందిన పిల్లగోని నర్సింహగౌడ్ ఎనికేపల్లి రెవెన్యూలో ఉన్న ఏ-1 గార్డెన్ వెంచర్‌లో 2004లో ప్లాట్‌నెంబర్ 55, 56లో మొత్తం 455 గజాలు కొనుగోలు చేసి ప్రహరీ నిర్మించాడు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్‌కార్డు లేదు. కాగా కూకట్‌పల్లికి చెందిన బొట్టు రఘు 2023లో పి.నర్సింహగౌడ్ పేరుతో నకిలీ ఆధార్ కార్డును సృష్టించి సెప్టెంబర్ 6న నగరానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ మహ్మద్, మజార్ అలీకి చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశాడు. ప్లాట్లు కొనుగోలు చేసిన ఇమ్రాన్ మహ్మద్, మజార్ అలీ 2023 సెప్టెంబర్‌లో ప్రహరీ కూల్చి చదును చేస్తుండగా పిల్లిగోని నర్సింహగౌడ్ అక్కడికి వచ్చాడు. తన ప్రహరీ ఎందుకు కూల్చేస్తున్నారని ప్రశ్నించగా తాము రిజిస్ట్రేషన్ చేసుకున్నామని బదులిచ్చారు. దీంతో నర్సింహగౌడ్ మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఏడాది తర్వాత శుక్రవారం నకిలీ ఆధార్ సృష్టించిన కూకట్‌పల్లికి చెందిన బొట్టు రఘును పట్టుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా అసలు సూత్రధారులను పోలీసులు పట్టుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ, చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80 దరఖాస్తుదారులకు రూ.34.96లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో పదిమార్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీలు పంపిణీ చేశామన్నారు. పేదలను వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రజా ప్రభుత్వం పలు పథకాలను రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల అరెస్టు అమానుషం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్

ఇబ్రహీంపట్నం రూరల్: మెప్మాలో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్‌ను అరెస్టు చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల జరుగుతున్న నేపథ్యంలో ఆర్పీ(రిసోర్స్ పర్సన్స్)ల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలపడంతో ఆదిబట్ల, తుర్కయంజాల్ పరిధిలో వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు ఠాణాకు చేరుకొని ఆర్పీలకు మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న 6,000 మంది ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపాలిటీల్లో ఎస్‌ఎస్‌జీ, ఎస్‌ఎల్‌ఎఫ్, టీఎల్‌ఎఫ్‌లకు బుక్ కీపింగ్ మహిళలకు బ్యాంకు, స్త్రీ నిధి నుంచి రుణాలు ఇప్పించడంలో కీలకపాత్ర వీరిదేనన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, ఝాన్సీ, పార్వతి, మాధవి, సబిత, వినోద, మహేశ్వరి, సువర్ణ, సేనిలత, శివకుమారి, జ్యోతి, మంజుల, ప్రియాంక, అపర్ణ, రాణి, విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.



ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్పీలకు మద్దతుగా సీఐటీయూ నాయకులు

ముందస్తు అరెస్టులు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ మెప్మా ఆర్పీలను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో నగరంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమం చేపట్టాలని మెప్మా సిబ్బంది నిర్ణయించడంతో ముందస్తు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

చేవెళ్ల: నిషేధిత గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాన్‌షాప్‌లు, టీ, కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత పథకాలను వినియోగించుకోవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ట్రెయినీ ఎస్‌ఐలు రాఘవేందర్‌రెడ్డి, జాబినా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

ఆమనగల్లు: కృత్రిమ ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ హెచ్చరించారు. తహసీల్దార్ లలిత ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం మండల పరిధిలోని శెట్టిపల్లిలో కురుమ పర్వతాలు, గణేశ్‌కు చెందిన కృత్రిమ ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేశారు.



శెట్టిపల్లిలో ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

స్వచ్ఛతలో ముందంజ

- తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీలకు అరుదైన గౌరవం
- ఈ నెల 19న న్యూ ఢిల్లీలో నిర్వహించే సదస్సుకు ఆహ్వానం
- రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీల కమిషనర్లకు పిలుపు

తుర్కయంజాల్: జిల్లాలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కింది. కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి ఈ నెల 19వ తేదీన న్యూఢిల్లీలోని కేంద్ర విజ్ఞాన కేంద్రం(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్–సీఎస్‌ఈ), హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించనున్న చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. న్యూ ఢిల్లీలోని హాబిటాట్ సెంటర్‌లోని సిల్వర్ ఓక్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించనున్నారు. హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రా, నేషనల్ మిషన్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా సిటీ సాలిడ్ వేస్ట్ యాక్షన్ ప్లాన్ (సీఎస్‌డబ్ల్యూఏపీ) అమలులో సత్ఫలితాలను సాధించినందుకు ఈ గుర్తింపు లభించనుంది. ఎంపికైన మున్సిపాలిటీల కమిషనర్‌లు వారి అనుభవాలను పంచుకునేందుకు అవకాశం కల్పించనున్నారని సమాచారం. పట్టణాల్లో బహిరంగ మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) స్థితి ని కొనసాగించడంతో పాటు, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే మున్సిపాలిటీలు కార్యక్రమంలో పాల్గొననున్నాయి.

ఎంపికైన మున్సిపాలిటీలు ఇవే

రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీల కమిషనర్‌లకు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఇప్పటికే ఆహ్వానాలను పంపించారు. దమ్మాయిగూడ, తూప్రాన్, ఘట్‌కేసర్, ఆదిబట్ల, సూర్యాపేట, కోరుట్ల, కొత్తపల్లి, ఇల్లందు, సిద్దిపేట, మణికొండ, అమీన్‌పూర్, పీర్జాదిగూడ, తుర్కయంజాల్, హుస్నాబాద్, శంషాబాద్, నార్సింగి, మహబూబ్‌నగర్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, నాగారం మున్సిపాలిటీల కమిషనర్‌లకు నవంబర్ నెలలో ఆహ్వానాలు అందాయి. దేశంలోని 24 రాష్ట్రాల నుంచి సుమారు 100 మున్సిపాలిటీలకు ఈ అవకాశం దక్కింది.

ప్రజల సహకారంతోనే..



ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద గతేడాది కేంద్ర ప్రభుత్వ అవార్డు ఆదిబట్ల మున్సిపాలిటీకి దక్కిందని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలకు ఈ నెల 19న న్యూ ఢిల్లీలో జరిగే సదస్సుకు ఆహ్వానం అందడం శుభపరిణామన్నారు. ఆదిబట్లను బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దామన్నారు. చెత్తలేని మున్సిపాలిటీగా సహకారంతో ముందుకు పోతున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు.

బాధ్యత పెరిగింది



చేంజ్ మేకర్స్ కాన్‌క్లేవ్‌కు ఆహ్వానం అందడం ఆనందంగా ఉంది. దేశంలోని 100 మున్సిపాలిటీల్లో తుర్కయంజాల్‌కు చోటు దక్కడం గర్వించదగ్గ విషయం. భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తాం.

– అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

తాపీ మేస్త్రీ బలవన్మరణం



వెంకటేశ్ మృతదేహం

కొందుర్గు: మద్యం మత్తులో భార్యతో గొడవపడిన ఓ తాపీ మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా జరుగుమల్లె మండలం కామయ్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(37), ఇంద్రజ దంపతులు 15 ఏళ్లక్రితం కొందుర్గుకు వచ్చి స్థిరపడ్డారు. వీరికి కొడుకు, కూతురు సంతానం. వెంకటేశ్ తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కిరాయి ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న వెంకటేశ్ గురువారం సాయంత్రం కూడా మద్యం సేవించి రావడంతో భార్య ఎందుకు తాగావని ప్రశ్నించింది. దీంతో ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన వెంకటేశ్ ఇంట్లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకుని ఇంటి పైకప్పునకు ఉన్న ఇనుప కొండీకి చున్నీతో ఉరేసుకున్నాడు. భార్య ఇంద్రజ అరుపులు విన్న చుట్టుపక్కల వారు తలుపులు ధ్వంసం చేసి లోనికి వెళ్లగా కొన ఊపిరితో ఉన్న వెంకటేశ్‌ను వెంటనే కొందుర్గు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సలహామేరకు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఇంద్రజ శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని హతమార్చిన తనయుడికి జీవిత ఖైదు

రూ.వేయి జరిమానా



నిందితుడు అనురాగ్

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయికి బానిసైన ఓ యువకుడు తండ్రిని హతమార్చిన ఘటనలో శుక్రవారం న్యాయ స్థానం శుక్రవారం తీర్పునిచ్చిందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన తిరుపతి రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్ సమీపంలోని ఆరెంజ్ అవెన్యూలో నివాసం ఉండేవారు. రవీందర్ పెద్ద కుమారుడు అనురాగ్ ఇంట్లోనే ఉంటూ గంజాయి సేవిస్తుండేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. దురలవాట్లు మానుకోవాలి.. పని చేసుకోవాలని మందలించడంతో తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం.. లీటర్ బాటిల్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 4న మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తల్లి సుధ స్నానానికివెళ్లగా తండ్రి భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో రవీందర్ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వెంటనే రవీందర్ మంటలతో ఇంట్లోంచి బయటకు పరుగుగెత్తుకుంటూ వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. వెంట వెళ్లిన అనురాగ్ తండ్రి తలపై బండరాయి వేసి క్రూరంగా హత్య చేశాడు. తల్లి సుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పూర్తి వాదనలు విన్న తదుపరి ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ శోభారాణి వాదించారు. తండ్రిని హతమార్చడం నేరంగా పరిగణించిన మెజిస్ట్రేట్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కొంగరకు చెందిన శీలం కిరణ్(25) రాత్రి సమయంలో వండర్‌లా నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కిరణ్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లోనే ఎక్కువ..!

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు

- ఆ తర్వాత మేడ్చల్ జిల్లాలో..

సాక్షి, సిటీబ్యూరో: సొంత స్థలాలున్నవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం సంబంధిత అధికారులు ఆ పనుల్లో పడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోకొచ్చే జిల్లాలు నాలుగున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కూడా ఉంది. ఈ కార్యక్రమం తొలిదశలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఏ జిల్లా పరిధిలో ఎందరున్నారో ప్రజాపాలన కార్యక్రమాల్లో అందిన దరఖాస్తుల్ని లెక్కలు తీశారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారు హైదరాబాద్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. ఈ జిల్లా పరిధిలోనే జీహెచ్‌ఎంసీ వార్డులు కూడా ఎక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. తర్వాత మేడ్చల్ జిల్లాలోని వారు ఎక్కువమంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల వంతున జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెరసి 84 వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కింద ఆర్థికసాయం అందనుంది.

జిల్లాల వారీగా వివరాలిలా ఉన్నాయి

జిల్లా	వార్డులు	దరఖాస్తులు
హైదరాబాద్	84	5,00,822
రంగారెడ్డి	25	1,96,940
మేడ్చల్	38	3,22,064
సంగారెడ్డి	3	20,711
కంటోన్మెంట్	8	29,909
మొత్తం	158	10,70,446

సర్వేయర్లకు సహకారం..

దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి 'ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్'లో వివరాలు నమోదు చేసేందుకు సర్వేయర్లుగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు ఆయా జిల్లాల సిబ్బంది పని చేయనున్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల చిరునామాను గుర్తించేందుకు జిల్లాల సిబ్బందికి, కంటోన్మెంట్ సిబ్బందికీ జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలో పనిచే స్తున్న యూసీడీ, ఎంటమాలజీ విభాగాల సిబ్బందితో పాటు రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు,తదితరులు సహకరించనున్నారు. మొబైల్ యాప్‌లో వివరాల నమోదు, అప్‌డేషన్‌ల కోసం జీహెచ్‌ఎంసీ జోనళ్లస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.



కుష్టు వ్యాధిపై అవగాహన



దండుమైలారంలో వివరాలు సేకరిస్తున్న సెంట్రల్ లెప్రసీ టీం సభ్యులు

ఇబ్రహీంపట్నం: కుష్టు వ్యాధి నిర్మూలన కోసం కేంద్ర బృందం దండుమైలారం గ్రామంలో శుక్రవారం పర్యటించింది. సెంట్రల్ లెప్రసీ టీమ్‌కు చెందిన డా.హరికృష్ణ, డా.బాలకృష్ణలతో కూడిన బృందం గ్రామంలో సర్వే నిర్వహించి, కుష్టువ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నాయా అనే విషయంపై ఆరా తీశారు. దండుమైలారం పీహెచ్‌సీ పరిధిలోని ఆరుగురు కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్యంపై పరిశీలన చేశారు. అనంతరం వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, ఆశ వర్కర్లు, ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు వీరి వెంట ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే సంఘాలు

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



అరుణ్‌గౌడ్, రేణుకను సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకునేందుకే సంఘాలుగా ఉండి సామరస్యంగా పోరాడాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సామాల మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల బాధ్యుడు బందయ్య ఆధ్వర్యంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర బాధ్యులు అరుణ్‌కుమార్‌గౌడ్ ఎస్టీయూ మహిళా కార్యదర్శి శ్రీదేవి ఆ సంఘానికి రాజీనామా చేసి పీఆర్‌టీయూటీఎస్ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారిని మహేందర్‌రెడ్డి సన్మానించి సంఘంలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈహెచ్‌ఎస్‌కు నిర్దిష్టమైన ప్రణాళిక కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. పీఆర్సీ అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. సీపీఎస్ అంశంపైన ముఖ్యమంత్రి తన మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఓపీఎస్ అమలుకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్‌నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్ రెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు రేణుకకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. ఈ సమావేశంలో అబ్దుల్ హమీద్, వెంకటయ్య, రేణుక, శేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరేందర్, సంజీవ్‌కుమార్, యాదగిరి, వేణుగోపాల్, మంజుల, బీమ్లానాయక్, నర్సింహారెడ్డి, జంగయ్య, జిల్లా బాధ్యులు వినోద్‌కుమార్, మహమూద్ జాహీద్, హుసేన్, రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, వేణు, రాములు, రాజ్యలక్ష్మి, సులోచన, మాలతి, సైరా సరిత నిషత్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ(చరిత్ర) సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెల్ట్, సెట్‌లు అదనపు అర్హతలుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈనెల 17లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.